నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, సోమవారం 27 జనవరి 2025 HYDERABAD


## కోసుకుంటారని..పందెం కోడిని కాపాడి..



కోడిని దక్కించుకున్న రామకృష్ణను సత్కరిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: పందెం కోడిని కోసుకుతింటారని.. భావించి..వేలం పాటలో ఆ కోడిని దక్కించుకొని..మూగ జీవాలపై ఉన్న తన ప్రేమను చాటుకున్నాడో వ్యాపారి. ఇటీవల అత్తాపూర్ పరిధిలో కోళ్ల పందేలపై పోలీసులు దాడులు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఉప్పర్‌పల్లిలోని కోర్టులో నిందితులకు జరిమానా విధించిన న్యాయమూర్తి.. పట్టుబడిన పందెం కోడిని వేలం వేయాలని ఆదేశించారు. కోర్టులో వేలం పాట నిర్వహించగా, వ్యాపారి రామకృష్ణ..ఆ కోడిని రూ. 2800కు దక్కించుకున్నాడు. మూగజీవాలపై ప్రేమ కలిగిన అతడు.. వేరేవాళ్లు ఆ కోడిని కోసుకొని తింటారని భావించి..వేలం పాటలో పాల్గొన్నాడని బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ చెప్పారు. ఆ కోడిని రామకృష్ణ తన ఫామ్ హౌస్‌లో పెంచుకుంటారన్నారు. రామకృష్ణను అసోసియేషన్ తరఫున సన్మానించినట్లు బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దామోదర్‌గౌడ్ తెలిపారు.

## ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..ఇద్దరిపై కేసు



బంజారాహిల్స్,జనవరి 26: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ బస్తీలో టీఎస్ నం. 1, బ్లాక్ ఎఫ్ వార్డు-9 పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలాన్ని బోగస్ పత్రాలతో ఆక్రమించుకునేందుకు కొంతకాలంగా సలీం, నౌషాద్ అనే వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ స్థలంలో నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా, ఇటీవల షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే ఎన్నిసార్లు చెప్పినా.. ఆక్రమణల ప్రయత్నాలు మానుకోలేదు. దీంతో ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న సలీం, నౌషాద్ మీద చర్యలు తీసుకోవాలని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం వారిద్దరి మీద బీఎన్ఎస్ 324(1), 329(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రశ్నించి.. నిలదీసి..

## రసాభాసగా 4 పథకాల ప్రారంభోత్సవ సభలు




కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రభాకర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డిని నిలదీస్తున్న ప్రజలను లాక్కెళ్తున్న పోలీసులు

- నిజమైన లబ్ధిదారులకు దక్కలేదన్న ప్రజలు
- ఎంపికలో అవకతవకలు జరిగాయని మండిపాటు
- కాంగ్రెస్ శ్రేణులకే కేటాయింపులంటూ.. ఆగ్రహం
- బెదిరింపులకు పాల్పడిన కాంగ్రెస్ శ్రేణులు
- ఘట్‌కేసర్ సభలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు, కలెక్టర్



బీఆర్ఎస్ నేతతో గొడవకు దిగిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

మేడ్చల్ /మేడ్చల్ రూరల్/ శామీర్‌పేట /ఘట్‌కేసర్ /కీసర, జనవరి 26 : ప్రజాపాలన అని గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సామాన్యులు, ప్రతిపక్ష పార్టీల నేతలకు అవమానం జరుగుతున్నది. అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలో ఆదివారం నిర్వహించిన 4 పథకాల ప్రారంభోత్సవ సభ రసాభాసగా సాగింది. కాంగ్రెస్ నేతల దౌర్జన్యం, దాడులకు పాల్పడే స్థాయిలో వ్యవహరించారు. గ్రామసభలో ప్రారంభోత్సవం తర్వాత ప్రజలు మాట్లాడవచ్చునని ప్రత్యేక అధికారి చెప్పడంతో రామలింగేశ్వరస్వామి దేవాలయ మాజీ డైరెక్టర్ వేణుగౌడ్ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, నిజమైన అర్హులకు కాకుండా కాంగ్రెస్ శ్రేణులకే కేటాయింపులు జరిగాయని ఆరోపించారు. ఎలాంటి తప్పులు జరగనప్పుడు లబ్ధిదారుల ఎంపికలో జాబితాను ఇవ్వడానికి అధికారులు, కాంగ్రెస్ శ్రేణులకు ఇబ్బందులు ఎందుకని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నేతలు ప్రభాకర్‌గౌడ్, జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి అక్కసు వెళ్లగక్కారు. దాడి చేసేంత పని చేశారు. పోలీసులు సైతం ప్రశ్నించిన నేతలను సభ నుంచి బయటకి లాక్కెళ్లారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే మైకులు ఎవడిచ్చాడురా ? ఎందుకిచ్చారు ఆ మైకును లాక్కోండి అంటూ సభ ముఖంగా మండల ప్రత్యేక అధికారే కేకలు వేయడం చర్చనీయాంశంగా మారింది. సభకు ముందుకు కాంగ్రెస్ నేతలకు వేదికపై సీటు కేటాయించలేదని నానా హైరానా చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలమని తమకు కొత్తగా అధికారులు గుర్తింపు ఇవ్వనమసరం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలుగా పదవులు అనుభవించామని అధికారులు గుర్తింపుతో మాకేం పని అని మండిపడ్డారు. పోలీసు పహారాలో లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మేయర్ శాంతికోటేశ్, మండల ప్రత్యేక అధికారి శంకర్‌కుమార్, సభ ప్రత్యేక అధికారి శ్రీధర్, ఎంపీడీవో మమతాబాయి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, పొన్నాల్ ఏఎంసీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జడ్పీ సీఈవో నీరజ్, ప్రత్యేక అధికారి సైదులు, ఎంపీడీవో వత్సలాదేవి, తాసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పథకాలు ..

అర్హత గలవారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. భోగారంలోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్‌లో గ్రామసభను నిర్వహించారు. రేషన్‌కార్డులు 244కి గాను 158, ఇందిరమ్మ ఇండ్లు 200 మందికి, ఆత్మీయ భరోసా కింద 36 మంది మహిళలు, రైతు భరోసా కింద 408 మందికి మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విడతల వారీగా అర్హులైన వారందరికీ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కీసర మండల తహసీల్దార్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సోమారంలో...

మేడ్చల్ రూరల్ : సోమారం గ్రామంలో అధికారులు ప్రజా పాలన గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులకు పథకాల మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో 61 మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోగా 27 మందిని ఎంపిక చేశారు. రేషన్ కార్డులకు 77 మంది దరఖాస్తు చేసుకోగా 60 మందిని ఎంపిక చేశారు. వీరితో పాటు 7 మందికి ఆత్మీయ భరోసా, 138 రైతు భరోసా మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ, తహసీల్దార్ శైలజ, ఎంపీడీవో వసంత లక్ష్మీ, ఏడీఏ వెంకట్రాంరెడ్డి, మండల వ్యవసాయ అధికారి అర్చన, మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికా నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదాయం ఆధారంగానే పథకాలు: ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు

ప్రభుత్వ పథకాల అమలు రాష్ట్ర ఆదాయాన్ని బట్టి పూర్తి అవుతుందని, ప్రజల ఆందోళన పడకుండా వచ్చే వరకు చూడాలని ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనపూర్ గ్రామంలో ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు ప్రజా పాలన ప్రత్యేకాధికారి శశాంక్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతంలతో కలిసి మంజూరీ పత్రాలను అందజేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏకపక్షంగా సభలు

ఘట్‌కేసర్‌లో ప్రజాపాలన సభలు ఏకపక్షంగా జరుగుతున్నాయని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి విమర్శించారు. ఘనపూర్ గ్రామంలో పథకాల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఉపన్యాసాన్ని అడ్డుకుని అనర్హులకు పథకాలను అందజేస్తున్నారని కలెక్టర్‌ను ప్రశ్నించారు. ప్రజాపాలన పథకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారా లేక కాంగ్రెస్ పార్టీ సభను నిర్వహిస్తున్నారా అని నిలదీశారు. పోలీసులు మహిపాల్ రెడ్డిని అడ్డుకుని కూర్చోబెట్టారు.



సరస్వతీగూడలో పథకాల మంజూరీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## న్యాయం జరిగే వరకు నిలదీస్తా

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 26 : అర్హులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించిన మంజూరీ పత్రాల ప్రక్రియను మండల పరిధిలోని సరస్వతీగూడ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అర్హులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వానిది గొప్పలెతప్పా.. చేసింది శూన్యమని, అర్హులకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తే ప్రతి పక్షాలు అడ్డుకుంటాయని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఎకరం భూమి ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గుంట భూమి ఉన్నా.. ఎంపిక చేయడం లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. తాము అధికారంలోకి వస్తే.. రైతు బంధు పథకం కింద ఎకరాకు రూ. 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పి, వానకాలం రైతు బంధును ఎగ్గొట్టి ఇప్పుడు ఎకరాకు రూ. 12వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం మాట తప్పినట్లు కాదా అని ప్రశ్నించారు. ఎన్ని సార్లు సర్వేల పేరిట కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. అర్హులైన ప్రజలందరికీ పథకాలను వర్తింప చేయకుండా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేయడంపై అభ్యంతర వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాటలతో కాలం గడుతున్నదని చెప్పారు. గ్యారంటీలు ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేసి భవిష్యత్‌లో పొరపాట్లు జరుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుధారాణి, ఎంపీడీవో సరిత, తహసీల్దార్ గోపాల్, మాజీ మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏపీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైఎస్ చైర్మన్ గోపీరెడ్డి విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాము ముదిరాజ్, జంగయ్య, ఈర్లపల్లి భూపాల్‌రెడ్డి, గంగాపురం గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులను ఎంపిక చేయలేదంటూ..

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రజలతో మాట్లాడుతుండగా ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, 'జాబితాలో అర్హుల పేర్లు ఎంపిక చేయలేదు' అని నిలదీశారు. కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్ రెడ్డి, కల్పించుకొని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రజలను రెచ్చగొట్టె అవసరం తనకు లేదని, అర్హులకు న్యాయం చేయాలని అధికారులకు సూచిస్తున్నానని చెప్పారు. దీంతో సభలో కొంత సేపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య గొడవ జరుగుతుండడంతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కల్పించుకొని ఇరు వర్గాలను శాంతింప చేశారు.



## సాగర్‌లో మంటలు..

ప్రమాదవశాత్తు పటాకులు పేలి బోట్లు దగ్ధం

భారతమాత మహాహారతి వేడుకల్లో అపశ్రుతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఖైరతాబాద్/బన్సీలాల్‌పేట్: భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఆదివారం నిర్వహించిన భారతమాత మహాహారతి వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. ప్రమాదవశాత్తు పటాకులు పేలి హుస్సేన్ సాగర్‌లో రెండు బోట్లు కాలిపోయాయి. రాత్రి 9గంటల ప్రాంతంలో వేడుకలు ముగిసే సమయంలో రెండు బోట్ల ద్వారా పటాకులు కాల్చేందుకు ఏర్పాట్లు చేయగా, అందులో భాగంగా జెట్టి, బోటును ఏర్పాటు చేశారు. అందులో భారీగా పటాకలను పెట్టారు. మహాహారతి ముగియగానే వెంటనే పటాకులను అంటించారు. స్కైషాట్‌ను కాల్చడంతో అది తిరిగి బోటులోనే పడిపోయింది. దీంతో ఒక్కసారిగా అందులో ఉన్న పటాకులు ఒక్కొక్కటికిగా పేలడం మొదలయ్యాయి. చూస్తుండగానే పటాకులన్నీ పేలడంతో జెట్టితో పాటు దాని వెంట ఉన్న బోటులో మంటలు వ్యాపించి అగ్నికి ఆహుతయ్యింది. ఆ సమయంలో జెట్టిపై నలుగురు, బోటులో ఇద్దరు ఉన్నారు. ఈ ప్రమాదంలో బోటు డ్రైవర్ పల్లె ప్రణీత్ (32), దుబ్బాసి సునీల్ (38)కు చేతులు, కాళ్లకు మంటలు అంటుకున్నాయి. అదే బోటులో ఉన్న నలుగురు యువకులు నీటిలో దూకి ఒడ్డుకు చేరుకున్నారు. క్షతగాత్రులను గాంధీ దవాఖానకు తరలించగా, ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. క్షతగ్రాతులకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై సెక్రటేరియట్ (లేక్) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నాలుగు ఫైరింజన్ల ద్వారా..

భారతమాత మహాహారతి కార్యక్రమంలో అప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉండగా, అక్కడే భారీగా పోలీసు బందోబస్తు ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలకు ఉపక్రమించారు. నాలుగు ఫైరింజన్లను రప్పించి సుమారు మూడు గంటల సేపు శ్రమించి మంటలను ఆర్పివేశారు. వేడుకులకు భారీగా తరలివచ్చిన సందర్శకులు భయాందోళనకు గురై పరుగులు తీశారు.

### ప్యాసింజర్ బోటుకు తప్పిన ప్రమాదం

మంటలు అంటుకున్న బోటు సుమారు రెండు గంటల పాటు నీటిలో తేలియాడుతూ ముందుకు కదిలింది. ఆ సమయంలో సాగర్‌లో ప్యాసింజర్ బోట్లు సైతం ఉన్నాయి. అక్కడి సిబ్బంది అప్రమత్తమై ప్రమాదాన్ని తప్పించారు.

# 37 కిలోమీటర్లు.. ప్రయాణికులు 3.70 లక్షలు

HYDERABAD METRO RAIL

- ఫేస్-2లో రద్దీ కారిడార్‌గా నాగోల్ -శంషాబాద్ మార్గం
- శామీర్‌పేట లింకేజీతో మరో 20 కిలోమీటర్ల మేర మెట్రో సేవలు

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రో విస్తరణలో ఫేస్-2లో అత్యంత రద్దీ కలిగిన మార్గంగా నాగోల్- శంషాబాద్ లైన్ కానున్నది. నాగోల్ నుంచి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేసే ఈ మార్గం పొడవు మొత్తం 36.8 కిలోమీటర్లు కాగా.. దీని ద్వారా నిత్యం 3.70 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నది. ఫేస్-2లో కారిడార్-4ను దాదాపు రూ. 11, 226 అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నగరం నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

### నార్త్ సిటీ అనుసంధానమైతే..

శంషాబాద్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు మెరుగైన రవాణా కల్పనలో భాగంగా మెట్రో ప్రతిపాదించిన మార్గం భవిష్యత్‌లో అత్యంత రద్దీ కలిగిన మార్గం కానున్నది. తొలి దశ మెట్రో నిర్మాణంలో నాగోల్-రాయదుర్గం మార్గం అత్యధికంగా ప్రయాణికులు వినియోగిస్తున్నారు. ఇదే తరహాలో ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ బిజీగా మారనున్నది. దీనికి అదనంగా 20 కిలోమీటర్లు నార్త్ సిటీ అనుసంధానం జరిగితే ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

### నాగోల్ నుంచి 23 స్టేషన్లు...

36.8 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో మొత్తం 23 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రతిపాదిత మెట్రో స్టేషన్ల నిర్మాణంపై కొన్ని మార్పులకు అవకాశం ఉందని తెలిసింది. ఇందులో నాగోల్, నాగోల్ చౌరస్తా, అల్కాపురి, కామినేని హాస్పిటల్, ఎల్బీ నగర్, బైరామల్‌గూడ, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట, ఓవైసీ హాస్పిటల్, డీఆర్డీవో, బాలాపూర్ రోడ్డు, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూ హైకోర్టు, గగన్ పహాడ్, శాతంరాయి, సిద్ధాంతి, శంషాబాద్, ఎయిర్‌పోర్టు కార్గో, ఎయిర్‌పోర్టు ప్రాంగణం వరకు ఈ మార్గాన్ని నిర్మించనున్నారు. ప్రాథమిక దశలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా నిర్మిస్తుండగా, భవిష్యత్‌లో మెట్రో వేగం పెరిగే అవకాశం ఉందని మెట్రో వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ మార్గానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం డీపీఆర్ పంపించిన విషయం తెలిసిందే.

## పరిశుభ్రత లేదు..!

నిబంధనలు పాటించని వ్యాపారస్తులకు నోటీసులు

కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు మలక్‌పేట, శివాలయ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వీధి వ్యాపారులే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు మలక్‌పేటలోని ఈశ్వర్ ట్రేడర్స్, విజయ సాయి బాయ్స్ హాస్టల్, బేగంబజార్‌లోని ఆకాశ్ ట్రేడింగ్ కంపెనీ, చంద్రా ఏజెన్సీ, పేట్ బషీరాబాద్‌లోని కాంచి కేఫ్, విజిటిలింగ్ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టి.. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు తేల్చారు. వాటిని స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.



# అద్దెలు చెల్లించని 1157 షాపులకు నోటీసులు

- జీహెచ్ఎంసీలో గ'లీజు' దందా'పై కదిలిన అధికారులు
- ఎస్టేట్ విభాగంలో ప్రక్షాళనకు కమిషనర్ నిర్ణయం

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో గ'లీజు' దందాలపై ఎట్టకేలకు అధికారులు కదిలారు. షాపుల అద్దె గడువు ముగిసినా..ఏండ్ల తరబడి కొనసాగుతున్న జీహెచ్ఎంసీ ఖజానాకు వ్యాపారస్తులు గండి కొడుతూ వస్తున్నారు. ముఖ్యంగా ఏండ్ల తరబడి లీజు గడువు ముగిసినా వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యం చేస్తున్నది. గజం స్థలానికి రూ.1 అద్దె చెల్లిస్తోన్న లీజు ఒప్పందాలు నేటికీ యధావిధిగా కొనసాగుతున్నాయి. అజాద్(మోతీ) మార్కెట్ లీజుల గడువు ఇందుకు ఉదాహరణగా పేర్కొంటూ ఇటీవల 'నమస్తే' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే కమిషనర్ ఇలంబర్తి ఎస్టేట్ విభాగంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 14 మున్సిపల్ మార్కెట్ల పరిధిలో 838 షాపులకు నోటీసులు జారీ చేశారు. వీటిలో 206 షాపులకు మాత్రమే హియరింగ్ నిర్వహించారు. వీటితో పాటు 13 మున్సిపల్ కాంప్లెక్స్‌లో 319 దుకాణాలున్నాయి. వీటన్నింటికీ నోటీసులు జారీ చేశారు. మొత్తంగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న వ్యాపారులను ఖాళీ చేయించడం, తద్వారా కొత్తగా టెండర్లతో ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు.

### లీజు పూర్తయ్యాక..

వాస్తవంగా లీజు పూర్తయ్యాక అధికారులు ఆయా దుకాణాలను ఖాళీ చేయించాలి. మళ్లీ టెండర్ వేలం వేసి ప్రక్రియను కొనసాగించాలి. ఏడాదికొకసారి అద్దె విలువ 5 శాతం మేర పెంచాలి. కానీ ఎస్టేట్ విభాగం నోటీసులతోనే సరిపెడుతున్నది. ఇటీవల కాలంలో 14 యూనియన్ కార్యాలయాలతో పాటు 2300 షాపుల లీజుదారులకు నోటీసులు ఇచ్చారే కానీ ఇప్పటి వరకు పురోగతి సాధించలేదు. అయితే తాజాగా మున్సిపల్ మార్కెట్లు, మున్సిపల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి 1157 షాపులకు నోటీసులు జారీ చేశారు.

### ఆన్‌లైన్‌లోకి ప్రతి ఆస్తి..

జీహెచ్ఎంసీ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి దాని ప్రకారంగా కంప్యూటరైజ్ చేశారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయిన, ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేసి వాటి వివరాలను అందులో పొందుపర్చారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి నివేదిక సిద్ధం చేశారు. లీజు మార్కెట్ రేటు ప్రకారంగా కేటాయింపు జరగాలని, లీజు పూర్తయిన ఇంకా కొనసాగుతున్న వివరాలను పూర్తి నివేదిక అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అద్దె చెల్లింపు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంతో పాటు ఒక్కొక్క ఆస్తికి ఒక ఐడీ కేటాయిస్తున్నారు.